క్లుప్తంగా

చురుగ్గా పెన్షన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, రంభి గోపి తదితరులు

అల్లిపురం: జగనన్న సామాజిక పెన్షన్లు 33వ వార్డులో చురుగ్గా పంపిణీ చేశారు. వార్డు వలంటీర్లు తెల్లవారు జాము నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. వీరితో పాటు వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంభి గోపీకృష్ణ, వార్డు మహిళా అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు, ఆడారి వెంకట మహేష్, వెంకటలక్ష్మి ఇంటింటికీ వెళ్లి వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుని పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో లైన్లు కాయాల్సి వచ్చేదని, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎండ వేడి తెలియకుండా ఇంటికే తెల్లవారక ముందే పెన్షన్ తీసుకువచ్చి అందజేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అటువంటి బాబు ముఖ్యమంత్రిగా కలకాలం పరిపాలించాలని వారు కోరుకున్నారు.

మొదటి రోజే 95 శాతం..



కల్లుపాకలు ప్రాంతంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో గురువారం 95 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సెక్రటరీలతో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీన పింఛన్లు ఇంటికి పంపిస్తున్న ఘనత సీఎం జగన్‌దే అన్నారు. మొదటి రోజే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణరాట



కల్యాణరాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు, దేవాలయ సిబ్బంది

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలకు గురువారం రాట మహోత్సవంతో శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ, వేదపండితులు ఉడుపు రాటకు పూజలు చేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, ఆవాహనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, నీలాపు రమణారెడ్డి, భక్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాపాహోంలో అన్నదానం



పాపాహోంలో అన్నదానం చేస్తున్న విల్లూరి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తల్లి విల్లూరి సరస్వతి వర్ధంతి సందర్భంగా గురువారం పాపా హోంలో చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ తన తల్లి ఐదవ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. అనంతరం పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద పేదలకు భోజనంతో పాటు పండ్లు పంపిణీ చేశారు.

అందరి ఎంపిక అదే

- ఎలక్ట్రానిక్ వస్తువులకు కేరాఫ్ కెప్టెన్ రామారావు జంక్షన్
- ఐదు దశాబ్దాలుగా ప్రసిద్ధి
- ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండదు





గీత్ సంగీత్ థియేటర్ ప్రాంతంలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ దుకాణాలు



అల్లిపురం: ఎలక్ట్రానిక్ హబ్‌గా విశాఖపట్నంలో అల్లిపురం కెప్టెన్ రామారావు జంక్షన్‌కు చక్కటి పేరుంది. ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండదంటే అతిశయోక్తికాదు. అతిచిన్న వస్తువు నుంచి లక్షల విలువ గల ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, సౌండ్ సిస్టమ్స్, లైటింగ్ మెటీరియల్స్ వరకు ఇక్కడ దొరుకుతాయి. గత ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతం ఎలక్ట్రానిక్స్ వ్యాపారానికి ప్రసిద్ధి గాంచింది.

దొరకని వస్తువంటూ లేదు..

ఎలక్ట్రానిక్ వస్తువులకు కేంద్రమైన గీత్ సంగీత్ సినిమా థియేటర్ కూడలి పాటు జ్యోతి థియేటర్ రోడ్డు, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఈ తరహా దుకాణాలు సుమారు వంద వరకు ఉన్నాయి. వీటిని ఎక్కువగా ఉత్తర భారతదేశ వ్యాపారులు నిర్వహిస్తున్నారు. చిన్న రేడియో నుంచి డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్స్ వరకు ఇక్కడ లభిస్తాయి. అదే విధంగా లైటింగ్, డెకరేటివ్ లైటింగ్, గృహోపకరణ విద్యుత్ దీపాల వంటివి విక్రయించే దుకాణాలు కూడా ఈ ప్రాంతంలో సుమారు 50 వరకు ఉన్నాయి. టీవీలు, రేడియోలు, హోం థియేటర్లు, టీవీ రిమోట్లు, సెట్ టాప్‌బాక్స్ రిమోట్లు, స్పీకర్లు, సౌండ్ బాక్స్‌ల వంటి కలకత్తా, రాయపూర్, ఢిల్లీ సెట్లతో పాటు బ్రాండెడ్ ఐటమ్స్ కూడా ఇక్కడ లభిస్తుంటాయి.

ఇతర ప్రాంతాల నుంచి కూడా..

ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు నగరంలో పలు ప్రాంతాల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులు రిటైల్‌గాను, హోల్‌సేల్‌గాను కొనుగోలు చేసేందుకు ఎంతో మంది ఇక్కడికి వస్తుంటారు. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి అనేక మంది వస్తుండటం విశేషం. ఈ ప్రాంతానికి వస్తే దొరకని వస్తువంటూ ఏమీ ఉండదన్న నమ్మకంతో ఈ ప్రాంతానికి వ్యాపారులు, కొనుగోలుదారులు వస్తుంటారు.

ఐదు దశాబ్దాలుగా వ్యాపారం చేస్తున్నాం..

ఐదు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఎలక్ట్రికల్ వ్యాపారం చేస్తున్నాం. మా షాపులో డిజైనింగ్ లైట్లు, డెకరేటివ్ లైట్లు, డిస్కో లైట్లు దొరుకుతాయి. విశాఖ జిల్లాతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా వినియోగదారులు వస్తుంటారు. సీజనల్‌గా వ్యాపారం బాగుంటుంది.

–నీలేష్ చౌదరి, లైటింగ్ ఎంటర్‌ప్రైజస్, గీత్ సంగీత్ ఏరియా.

ఎలక్ట్రానిక్ వస్తువులకు కేంద్రం

ఎలక్ట్రానిక్ వస్తువులకు ఈ ప్రాంతం ప్రసిద్ధి గాంచింది. నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువుల వ్యాపారంతో పాటు సర్వీస్ కూడా చేస్తున్నాం. ఎటువంటి వస్తువు అయినా ఈ ప్రాంతంలో దొరుకుతుంది.

– ఏవీ సతీష్, లక్ష్మీ ఎలక్ట్రానిక్స్, అల్లిపురం.

ఎటువంటి వస్తువు అయినా దొరుకుతుంది.



ఎక్కడా దొరకని వస్తువులు ఇక్కడ దొరుకుతాయి. చిన్న ఎల్‌ఈడీ లైట్ల నుంచి పెద్ద సౌండ్ సిస్టమ్ వరకు దొరుకుతాయి. పలు రకాల వస్తువుల కోసం ఎక్కడెక్కడి నుంచో వినియోగదారులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. గీత్ సంగీత్ థియేటర్, లీలామహల్ జంక్షన్, జ్యోతి థియేటర్ రోడ్డు, కెప్టెన్ రామారావు జంక్షన్ ప్రాంతాల్లో అధికంగా ఈ దుకాణాలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్ , ఎలక్ట్రికల్ వస్తువులకు ఈ ప్రాంతం ప్రసిద్ధి. –బడే నాగరాజు, అచ్చియ్యమ్మపేట

డిమాండ్ల సాధనకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



నిరసన ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: డిమాండ్ల సాధనకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు గురువారం నిరసన చేపట్టారు. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్ పిలుపు మేరకు చేపట్టిన నిరసన డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. అనంతరం విగ్రహ కూడలిలో మానవ హారం చేపట్టారు. వేజ్ రివిజన్, పెన్షన్ రివిజన్ జరపాలని, 4జీ వెంటనే ఇవ్వాలని, కేరళ కోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలని, ఎగ్జిక్యూటివ్‌తో సమానంగా పదోన్నతి పాలసీ చేయాలని తదితర డిమాండ్లు చేశారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 14న గవర్నర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ ఫోరమ్ కన్వీనర్ సీఈ సీహెచ్‌వీ సాగర్, శ్రీకాంత్, సురేష్, రామాంజనేయులు, మూర్తి, సూర్య, గోవిందరాజులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న దాతలు, ఆలయ ప్రతినిధులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ జరిగింది. ప్రతి వారం ఒక దాత సహకారంతో ఈ అన్నదానం చేపడుతున్నట్లు కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ తెలిపారు. ఈ వారం ప్రముఖ వ్యాపార సంస్థ శుభప్రద హోల్డింగ్స్ సహకారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పంపాన గణేష్, జాయింట్ సెక్రటరీ బడే నాగరాజు, సహ కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధి పలు ఆలయాల్లో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు, విశేష హోమాలు నిర్వహించారు.

ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. మెయిన్‌రోడ్డు సూర్యాబాగ్‌లో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష హోమాలు జరిపారు. కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మహాశాంతి హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల ఈవోలు కె. శిరీష, బుద్ధ నాగ జగదీష్, శ్రీనివాస రావు, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పిల్లలకు సామాజిక కార్యకర్త కేవీఎస్ నరసింహం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ జి. అనురాధ పిల్లలకు పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పీవీఎస్ రాజు, సిబ్బంది వర్మ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వినతి



మేయర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం కలిసి దక్షిణ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించేలా అధికారులకు సూచనలు జారీ చేయాలని కోరారు.

దీనిలో భాగంగా 41వ వార్డు మరియదాసు కల్యాణ మండపం త్వరగా పూర్తి చేయాలని కోరారు. 35వ వార్డులో జనతా బజార్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు చేపట్టే ముందు అక్కడ వ్యాపారం చేసే వారికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కోరారు. 36వ వార్డు సత్యనారాయణస్వామి ఆలయం ఘాట్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, మరీ ముఖ్యంగా జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కోరారు.

కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి..

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి ఎమ్మెల్యే వాసుపల్లి మరికొన్ని సమస్యలు నివేదించారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని.. 41వ వార్డు జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివశిస్తున్న విస్సరాపు నాగమణి, నారాయణమూర్తి దంపుతుల ఏకైక కుమారుడు చైతన్య (12) గత ఏడాదిలో ఏపీఈపీడీసీఎల్ ట్రాన్స్‌కో లైన్ తగిలి చనిపోయిన కారణంగా వారి కుటుంబ సభ్యులకు ట్రాన్స్‌కో విభాగం ద్వారా రూ.5 లక్షల నష్టపరిహారం ఇచ్చారని, కుటుంబంలో ఒకరికి జీవీఎంసీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. అలాగే ఆర్కే బీచ్, వైఎంసీఏ సమీపంలో దుకాణాలపై వ్యాపారం చేసుకునే సునీల్ జోషి, కుమార్ జోషి షాపును బీచ్ అభివృద్ధి పనుల్లో భాగంగా 2018లో తొలగించారని, వారికి ప్రత్యామ్నాయంగా బీచ్ ఏరియాలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరారు.

పేదల మీద సవతి తల్లి ప్రేమ

మహారాణిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల మీద సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దసపల్లా, రేడియంట్, ఎన్సీసీ భూముల్లో కూడా పేదలకు స్థలాలు ఇవ్వాలన్నారు. అనకాపల్లి జిల్లా బయ్యవరం పంచాయతీ పరిధిలో కొంతమంది బడాబాబులు భూముల రికార్డుల తారుమారు చేశారని, అందులో ఎస్సీలకు ఇచ్చిన భూములు ఉన్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భూముల కుంభకోణాన్ని వెలికి తీస్తామని, ఎవరిని వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నివారణ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధి 25వ వార్డు రెల్లి వీధిలో గురువారం మలేరియా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా సీతంపేటలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించాయి. ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. కరోనా కష్టకాలంలో వైద్య, ఆరోగ్య, పారిశుధ్య, సచివాలయ సిబ్బంది వెలకట్టలేని సేవలు అందించారని కొనియాడారు. మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా జీవీఎంసీ, మలేరియా సిబ్బందికి సహకరించాలని కోరారు.

నీటి నిల్వలు ఉంచొద్దు..

జిల్లా మలేరియా అధికారి వై.మణి, బయాలజిస్ట్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ నెల నుంచి అక్టోబరు వరకు నగరంలో మలేరియా జ్వరాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జీవీఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ రామిరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ మలేరియాను వ్యాప్తి చేసే ఎనాఫిలస్ దోమలు నిల్వ ఉన్న మంచినీటిలో పెరుగుతాయన్నారు. వాటి నియంత్రణకు గోళాలు, కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులపై మూతలు పెట్టాలని సూచించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు, మలేరియా సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కొల్లి సింహాచలం తదితరులు

జగదాంబ: జగనన్న ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశారని కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా గురువారం జీవీఎంసీ 39వ వార్డులో లక్ష్మీ టాకీస్ వద్ద మహిళలతో కలిసి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లలో రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి జగనన్న చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వర రావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఎమ్మెల్యే ఔదార్యం



అనారోగ్యంతో బాధపడుతున్న సయ్యద్ ప్యారీకి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: ప్రజాదర్బార్‌లో అందిన అర్జీల ప్రకారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పలువురికి ఆర్థిక సాయం చేశారు. జీవీఎంసీ 39వ వార్డు కోటవీధిలో సయ్యద్ ప్యారి, పెద్రీరోడ్డులో ఉన్న గల్లా జానీ, వాడవీధికి చెందిన సూరాడ రాజారావుకు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి నిరంతరం ఎదురు చూస్తుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాల్జి, సలీం, రమణమ్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు కోలా పరామర్శ



మత్స్యకారులకు నిత్యావసరాలు అందజేస్తున్న కోలా గురువులు తదితరులు

మహారాణిపేట : పాక్ జైలు నుంచి విడుదలైన మత్స్యకారులకు తన వంతు సహకారం అందించడానికి కృషి చేస్తానని, వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకు వెళతామని ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు అన్నారు. ఇటీవల పాకిస్థాన్ జైలు నుంచి విడుదలైన మత్స్యకారులను గురువారం ఆయన శ్రీకాకుళంలోని జాలారి కొయ్యాం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. గురువులు వెంట మత్స్యకార సంఘం జిల్లా ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, కొమర శంకర్‌రావు, మత్స్యకార కార్పొరేషన్ సెంట్రల్ బోర్డు డైరెక్టర్ తోటమ్మ, స్థానిక మత్స్యకార నాయకులు ఉన్నారు.

3న మాస్ట్రో గీతాల సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా 80వ జన్మదినోత్సవం, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 77వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 3న కళాభారతి ఆడిటోరియంలో మాస్ట్రో ఇళయరాజా స్వరపరచిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు యాక్మీ స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పాలమరశెట్టి ప్రతాప్‌కుమార్ తెలిపారు. సంగీత విభావరి పోస్టర్‌ను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరింపజేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, ప్రపంచ పర్యావరణ దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 3న సాయంత్రం 6 గంటలకు కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో సినీ నేపథ్య గాయకులు నిత్య సంతోషిని, నెల్లూరు రాము, నాదప్రియ, ఐఏఎస్ అధికారి డాక్టర్ జి. లక్ష్మీశా, హజ్రత్, యాక్మీ ఆనంద్ కుమార్, డి. భూపతిరావు ఇళయరాజా స్వరపరచిన గీతాలు ఆలపించనున్నారని ప్రతాప్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, యాక్మీ ప్రతినిధులు పి. పర్వేష్, కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.